గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు

మేడ్చల్, ఏప్రిల్ 7: మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నాయకులతో కలిసి కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకుని, వేద పండితుల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు.

ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ

పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కాప్రా, ఏప్రిల్ 7: కాప్రాకు చెందిన పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా కాప్రాసర్కిల్ జమాతే ఇస్లాం అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ జమాతే ఇస్లామ్ తరపున బియ్యం, పండుగ సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. కాప్రాలోని జామామసీదు కమిటీ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు, కాప్రా ఈద్గాకమిటీ అధ్యక్షులు ఎం.కే. బద్రుద్దీన్ చేతుల మీదుగా నిరుపేద ముస్లింలకు పండుగ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఖాజా, మహ్మద్ సలీం, రఫీక్, ఎండీ మక్బూల్, మహ్మద్ గౌసుద్దీన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయురాలు ప్రమీలకు ఉగాది పురస్కారం

తెలుగు ఉపాధ్యాయురాలు ప్రమీలను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

రామంతాపూర్, ఏప్రిల్ 7: సామాజిక రంగం, తెలుగు భాష కోసం విశేష కృషి చేసిన రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు ప్రమీలకు ఉగాది పురస్కారం లభించింది. ఈ మేరకు ఆదివారం సృజన ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పలువురు ప్రముఖులు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ సన్మానాలు బాధ్యతను పెంచుతాయన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తాం..

అల్వాల్ సర్కిల్ వెంకటసాయినగర్, వేంకటేశ్వరనగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

మల్కాజిగిరి, ఏప్రిల్ 7: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తామని వెంకటసాయినగర్,వేంకటేశ్వరనగర్ కాలనీల అధ్యక్షుడు సురేశ్ కుమార్ అన్నారు. ఆదివారం అల్వాల్ సర్కిల్‌లోని వెంకటసాయినగర్, వేంకటేశ్వరగర్ కాలనీల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడుగా ఎంవీ సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా శివయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా సురేశ్, సలహాదారులుగా వెంకటరత్నం, సదాశివ శాస్త్రి, నారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బోస్, సుభాశ్, జ్ఞానేశ్వర్, జవహర్, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, శ్రీనివాస్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి :ఎమ్మెల్యే

యాప్రాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 7: మల్కాజిగిరి నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం యాప్రాల్, శాంతి నగర్‌లోని వివిధ కాలనీవాసుల ముఖ్య సమేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాప్రాల్,శాంతినగర్ కాలనీవాసులు ఆలయం కోసం స్థలాన్ని, త్రీ ఫేజ్ ఎలక్ట్రిసిటీ లైన్ ఎత్తుపెంచాలని, డ్రైనేజీ సమస్య, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వైన్‌షాపులు, సెల్‌టవర్స్ తొలగించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ఎమ్మెల్యే వెంటనే వివిధ శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతానని ఎలాంటి సమస్యలున్నా నా దృష్టికి తీసుకురావాలని కాలనీవాసులకు సూచించారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, అంజయ్య, కరంచంద్, మధుసూదన్‌రెడ్డి, శివకుమార్, రమేశ్, వసంత్, శ్రీనివాస్, విక్రమ్, శోభా, ప్రమీల, శాంతినగర్ కాలనీవాసులు రాగి వెంకట్, సత్యం, వీరేశం, వెంకటేశ్వర్లు, త్యాగరాజు, బిక్షపతి, శ్రీహరిబాబు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి

మల్కాజిగిరి : పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారంక్యాంప్ కార్యాలయంలో ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కస్తూరిభానగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.75వేల చెక్కును ఎమ్మెల్యే వారికి అందజేశారు.

నాగారంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మమతాకృష్ణారెడ్డి

చలివేంద్రం ప్రారంభం

ఘట్‌కేసర్,ఏప్రిల్7:మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లైఓవర్ కింద మున్సిపాలిటీ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్డ్యానాయక్, కౌన్సిలర్ సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు బి.సత్తిరెడ్డి,శేఖర్ ముదిరాజ్,బి.రాజేశ్వర్‌రెడ్డి,జితేందర్ నాయక్,కెఎంరెడ్డి, రాఘవేందర్ కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీలో..

మేడ్చల్ కలెక్టరేట్: స్థానికులు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కౌన్సిలర్ కౌకుట్ల మమతాకృష్ణారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ కౌకుట్ల మమతాకృష్ణారెడ్డి వార్డు పరిధిలోని ఎస్వీనగర్ మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

అన్నోజిగూడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ బి.కొండల్‌రెడ్డి.

ఉప్పల్ పిస్తా హౌజ్..

నిర్వాహకులకు జీహెచ్ఎంసీ నోటీసులు

ఫుడ్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించినట్లు తనిఖీల్లో గుర్తింపు

పిస్తాహౌజ్‌లోపల ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ఫంగస్‌తో కూడిన కేక్‌లను అందిస్తున్నారన్న ఫిర్యాదుపై ఉప్పల్ పిస్తాహౌజ్‌పై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు.

ఆహార భద్రతా నిబంధనల అమలుపై తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ఉల్లంఘన, లోపాలు ఉన్నట్లు గుర్తించి సదరు పిస్తా హౌజ్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఫిస్తా హౌజ్ ఫ్లం కేక్, స్పాంజ్ కేక్, మిల్క్ బ్రెడ్ నమూనాలను తీసుకుని స్టేట్ ఫుడ్ లాబొరేటరీకి శాంపిల్స్ పంపించామని, ఆ నివేదిక రాగానే తదుపరి చర్యలు ఉంటాయని ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా కర్వేందర్ అనే ఫిర్యాదుదారు పిస్తా హౌజ్ లోపాలను తమ దృష్టికి తీసుకువచ్చారని, ఆ ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. వ్యాపార సంస్థలు, ఫుడ్ కోర్టు నిర్వాహకులు పరిశుభ్రత వాతావరణంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

అభివృద్ధికి సహకరించాలి

మేడ్చల్: మేడ్చల్ జడ్పీటీసీ శైలజారెడ్డి, శ్రీరంగవరం మాజీ సర్పంచ్ విజయానందారెడ్డి ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జంగయ్య యాదవ్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

బన్నీ(ఫైల్)

జవహర్‌నగర్, ఏప్రిల్ 7: చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం...కార్పొరేషన్‌లోని జ్యోతి రావుకాలనీలో మల్లేశ్, భార్య కవిత, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. ఈనెల 2న తల్లిదండ్రులు పనులకు వెళ్లగా... కుమారులు పాఠశాలకు వెళ్లారు. ఇంట్లో గ్యాస్ లీకైన విషయం కుటుంబసభ్యులకు తెలియదు. పాఠశాల నుంచి ఇంటికి ఇచ్చిన కుమారుల్లో చిన్న కుమారుడైన బన్నీ(7) ఇంటి గడియ తీసి ఇంట్లోకి వెళ్లి లైట్ వేశాడు. అప్పటికే ఇంట్లో గ్యాస్ లీకై ఉండటంతో ఒక్కసారిగా సిలిండర్ పేలి రేకులు ఎగిరిపడి బాలుడికి మంటలు అంటుకున్నాయి. తీవ్ర గాయాలపాలైన బన్నిని గాంధీ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న బాలుడు ఆదివారం మృతి చెందడంతో జ్యోతిరావుకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో ఎంపీపీ చేరిక

కీసర, ఏప్రిల్ 7: కీసర మండల పరిషత్ అధ్యక్షురాలు మల్లారపు ఇందిరలక్ష్మీనారాయణ తన అనుచరవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్‌గౌడ్ సూచనలతో ముందుగా వారిని కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీపీ ఇందరాలక్ష్మీనారాయణ, చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ తన అనుచరవర్గంతో ఉదయం నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం వారికి స్వాగతం పలికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్, మండల అధ్యక్షులు కృష్ణయాదవ్, నాయకులు శివలింగాల శ్రీనివాస్‌గౌడ్, ఈ శ్రీనివాస్, శ్రీహరి గౌడ్ పాల్గొన్నారు.

సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి

మేడ్చల్, ఏప్రిల్ 7: సమాజ పురోభివృద్ధిలో ఇంజినీరింగ్ విద్యార్థులు భాగస్వాములు కావాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ వార్షికోత్సవాన్ని ఎప్లోరెన్స్ 2కే14 పేరుతో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, సముపార్జించిన పరిజ్ఞానంతో సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తమ ఆవిష్కరణలతో పనులను సులభసాధ్యం చేయాలని సూచించారు. ఉద్యోగం ఒక్కటే లక్ష్యంగా కాకుండా సంపద సృష్టికి, పది మందికి ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేయాలన్నారు. చాలా మంది విద్యార్థులు ఇంజినీరింగ్ చదివి, వేరే రంగాల్లోకి వెళ్తున్నారన్నారు. ఎంచుకున్న రంగంలో పరిజ్ఞానాన్ని విస్తృతం చేసుకొని, నైపుణ్యాలను పెంపొందించుకుంటే మార్కెట్‌లో అవకాశాలకు కొదువ ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి, కార్యక్రమంలో వసంతలత, సీఈవో అభినవ్ రెడ్డి, ఐశ్వర్య, డైరెక్టర్‌లు రాజిరెడ్డి, ఆలీబేగ్, డీన్ వెంకటరమణయ్య,హెచ్‌వోడీలు,డీన్‌లుపాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

తాగునీటి సమస్య పరిష్కారానికి

టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

బోడుప్పల్, ఏప్రిల్7: తాగునీటి సమస్య సత్వర పరిష్కారానికి బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలకు టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ రామలింగం ఓ ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులు, పైపులైను లీకేజీలు, అక్కడక్కడా పైపులైనులు పగలడం లాంటి సమస్యలను పరిష్కరించడానికి నగరప్రజలు 040-27215959 నంబరుకు ఫోన్ చేసి సమస్యను తెలుపాలని ఆయన కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 7: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోపాల్ అనే యువకుడు అకస్మాత్తుగా మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీజేపీ యువ నేత కౌకుట్ల రాహుల్ రెడ్డి యువసేన తరుపున గోపాల్ తండ్రి బాలరాజుకు అంత్యక్రియల కోసం రూ.5వేలను ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాకేశ్ యాదవ్, నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భగాయత్‌లో లోఫ్రెషర్ వాటర్‌తో ఇబ్బందులు

రామంతాపూర్, ఏప్రిల్ 7: వేసవి కాలం వచ్చిందంటే రామంతాపూర్ డివిజన్ పరిధిలోని సాయికృష్ణానగర్, సత్యనగర్, కేసీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయి. గతంలో వేసిన కొత్త పైప్‌లైన్ల వల్ల లో ఫ్రెషర్ వాటర్ వస్తుండడంతో ఆయా కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. రోజు విడిచి రోజు నీరు వదులుతున్నారు. ఆ వచ్చే కొద్ది పాటి నీరు సరిపోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వివరించామని ఇప్పటి వరకు సమస్య పూర్తి స్థాయిలోపరిష్కారం కాలేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే జూన్ లాస్ట్ వీక్ వర్షాలు పడే వరకు నీటి కొరత ఎలా ఉంటుందో అని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్లకు వాల్స్ ఏర్పాటు చేయకపోవడం వల్ల ఇలాంటి దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సికింద్రాబాద్,ఏప్రిల్7: ఇటీవలే కాంగ్రెస్ ప్రకటించిన పార్లమెంట్ స్థానాల్లో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు స్థానం కల్పించకుండా చేసిన తీవ్రమైన అన్యాయాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం సీతాఫల్ మండి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్‌మాదిగ, కొమ్ము శేఖర్, తుమ్మల శివప్రసాద్, నర్సింగ్, గసగంటి విజయకుమార్, మహేందర్, దేవేందర్, సుజాత, మురళీధర్ పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

అవినాశ్ (ఫైల్)

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 7: యువకుడు అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాసరావు కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా తేజాపూర్ విలేజ్‌కి చెందిన అవినాశ్ (26) గత కొన్ని రోజుల క్రితం జీవనోపాధి కోసం నేరేడ్‌మెట్‌కు వచ్చాడు. స్థానిక సమతానగర్‌లో ఓ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. అయితే గతనెల 28న షాపులో తనఫోన్ పెట్టి బయటకు వెళ్లిపోయాడు. ఇప్పటి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు , షాపు యజమాని అంతటా వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆదివారం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి

అల్లాపూర్, ఏప్రిల్ 7: మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మా రెడ్డి గెలుపు ఖాయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధి చంద్ర గార్డెన్స్‌లో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మణ్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సబీహా బేగంతో ఆదివారం కలిసి కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పదేండ్లుగా తెలంగాణ రాష్ట్రం అన్ని రాంగాల్లో అభివృద్ధి పర్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. కేటీఆర్, కేసీఆర్ సహకారంతో కూకట్‌పల్లిలో రూ.కోట్ల నిధులు వెచ్చించి ఫ్లైఓవర్లు, అండర్ పాస్లు, చెరువులు, నాలాలు, ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించామని ఎమ్మెల్యే తెలిపారు. స్థానికుడు రాగిడి లక్ష్మారెడ్డి, గెలిపించుకునేందుకు ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా అల్లాపూర్ ఓటర్లను విజ్ఞప్తి చేశారు.

ఆరు గ్యారెంటీలతో మోసం

- కాంగ్రెస్‌కు తగిన బుద్ధిచెప్పాలి
- బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి
- వెస్ట్ మారేడ్‌పల్లిలో పార్కులో వాకర్లతో సమావేశం

వెస్ట్ మారేడ్‌పల్లిలోని నెహ్రూ పార్కులో వాకర్స్‌తో సమావేశానికి వెళుతున్న బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్, ఏప్రిల్ 7: ఆరు గ్యారెంటీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ వంటి అన్ని పథకాల్లో మోసం చేశారని దుయ్యబట్టారు. ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని నెహ్రూ నగర్ పార్కులో ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి వాకర్స్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భారీ మెజారిటీతో గెలిపిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను ప్రపంచ దేశాలు ప్రశంసించేలా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. మల్కాజిగిరి ఎంపీగా ఎన్నికైన తర్వాత రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను వినియోగించుకోలేక పోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్కాజిగిరి నియోజక వర్గం అభివృద్ధికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కోట్లాది రూపాయలను ఖర్చు చేశారని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని సరిగ్గా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, వాకర్స్, నెహ్రూ నగర్ పార్కు డెవలప్ మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి తలసానితో భేటీ అయిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి